క్లుప్తంగా

జగనే ఎందుకు సీఎం కావాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కొత్తపట్నం: ఆంధ్రప్రదేశ్‌కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగనన్న సచివాలయాల కన్వీనర్ ఆళ్ల రవీంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కొత్తపట్నంలోని వాసవీ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు నవంబర్ 9వ తేదీ నుంచి డోర్ టూ డోర్ కార్యక్రమం నిర్వహించాల్సి ఉందన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో పార్టీ గ్రామ అధ్యక్షులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మ తల్లి కొలుపులు


పూజలు చేస్తున్న మారం వెంకారెడ్డి

చీమకుర్తి: చీమకుర్తి రెడ్డినగర్‌లో బడే వారి అంకమ్మ తల్లి కొలుపులను ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి పాల్గొని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు బడే దశరథరామిరెడ్డి, బడే అయ్యపరెడ్డి, పోకూరి రామకృష్ణారెడ్డి, మారం వెంకటేశ్వరరెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ సమావేశం నిర్వహణ


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరావు

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) సమావేశాన్ని ఆదివారం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించారు. పాత పద్ధతిలో ఉపాధ్యాయ, విద్యార్థుల నిష్పత్తి ఉండాలని, ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడి పోస్టులు తొలగించిన స్థానంలో తిరిగి మంజూరు చేయాలని కోరారు. పలు సమస్యలపై చర్చించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలాజీ, జిల్లా కార్యదర్శి దిలీప్‌చక్రవర్తి, కోశాధికారి బీవీఎస్ గుణప్రసాద్, కోర్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

1,446 మందికి వైద్య సేవలు

ఒంగోలు టౌన్: స్థానిక నెల్లూరు బస్టాండ్ సెంటర్లోని డీఆర్ఆర్ఎం హైస్కూల్లో ఆదివారం దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో మొత్తం 1,446 మందికి వైద్యసేవలు అందించినట్లు క్యాంపు నిర్వాహకుడు మాదాల వెంకటరావు తెలిపారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు గోపాళం శివన్నారాయణ, బి.హరిబాబు, ధీరజ్‌బాబు, ఎస్.సందీప్, ప్రకాశ్, చైతన్య, శరత్ తదితరులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, పక్షవాతంతో బాధపడుతున్న వారికి వైద్య చికిత్స నిర్వహించి రూ.200కే రెండు నెలలకు సరిపడా మందులు అందజేశారు. వైద్య శిబిరం నిర్వహణకు ఆర్థికసాయం అందించిన చీమకుర్తికి చెందిన డాక్టర్ జవహర్‌కు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

మెరుగైన పారిశుధ్యానికి సహకరించాలి

- కమిషనర్ వెంకటేశ్వరరావు


కమిషనర్ వెంకటేశ్వరరావుకు క్లాప్ యూజర్ చార్జీలు చెల్లిస్తున్న మస్తాన్ హోటల్ యాజమాన్యం

ఒంగోలు టౌన్: నగరంలో మెరుగైన పారిశుధ్యానికి ప్రజలంతా సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు కోరారు. రోజువారీ పారిశుధ్య కార్యక్రమాల పర్యవేక్షణలో భాగంగా ఆదివారం నగరంలోని కబాడీపాలెం, కొండయ్య బంకు, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఇళ్లలోని చెత్తను మురుగుకాలువల్లో వేయడం వలన మురుగు నీరు పారకుండా అడ్డుపడుతోందని, దాని వలన దోమలు పెరిగి డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజలంతా తమ ఇంటి వద్దకు వచ్చే క్లాప్ ఆటోలకు చెత్త ఇవ్వాలన్నారు. కొండయ్య బంకు బజారులో జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా క్లాప్ యూజర్ చార్జీల నిమిత్తం మస్తాన్ హోటల్ యాజమాన్యం రూ.1000 కమిషనర్‌కు అందజేశారు. మరికొందరు యూజర్ చార్జీలను అక్కడికక్కడే చెల్లించారు.

అప్రమత్తతతో వ్యాధులు దూరం

- వాతావరణం మారిన నేపథ్యంలో రోగాలు ప్రబలే ప్రమాదం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



ఒంగోలు సెంట్రల్: వాతావరణం మారిన ప్రస్తుత సమయంలో అప్రమత్తంగా లేకుంటే వ్యాధులు పట్టి పీడించే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే సీజనల్ వ్యాధులు ప్రజలను పీడిస్తున్నాయి. ఇళ్ల పరిసరాల్లో పరిశుభ్రమైన వాతావరణం లేకపోవడంతో పాటు వ్యాధులపై అవగాహన లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంది. రెండుమూడు రోజులుగా వర్షాలు కురుస్తూ వాతావరణం మారినందున కొద్ది పాటి జాగ్రత్తలు పాటిస్తే రోగాలకు దూరంగా ఉండవచ్చు. ముఖ్యంగా రోడ్ల పక్కన విక్రయించే ఆహార పదార్థాలు తినకూడదు. వర్షాకాలంలో తడవకపోవడం, వేడి నీరు తాగడం వలన రోగాల బారి నుంచి తప్పించుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. పలు వ్యాధులు, నివారణ మార్గాల గురించి అవగాహన అవసరమంటున్నారు. దోమల నివారణకు ప్రభుత్వం కూడా తగిన చర్యలు చేపట్టింది. ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు సహకరించి వ్యాధులకు దూరంగా ఉండాల్సిన అవసరం ఉంది.

కామెర్లు...

కాలేయం వైరస్ ఇన్‌ఫెక్షన్ రావడమనేది వర్షాకాలంలో సర్వసాధారణ విషయం. ఈ వ్యాధి కలుషిత నీటి వలన సోకుతుంది. హెపటైటిస్ వైరస్ వలన ఈ వ్యాధి వ్యాపిస్తుంది. మూత్రం పసుపు పచ్చగా ఉండటం, కళ్లు సైతం పసుపు వర్ణంలోకి మారడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి.

మలేరియా, డెంగీ, చికున్ గున్యా...

జ్వరం తీవ్రంగా ఉన్నప్పుడు శరీరం వణుకుతుంది. పిల్లల్లో చలి జ్వరం ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ఇది మలేరియా వ్యాధి లక్షణంగా భావించవచ్చు. డెంగీ, చికున్ గున్యా వ్యాధులతో ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. చిన్నారుల్లో తలనొప్పి, తుమ్ములు, జ్వరం, వెన్నునొప్పి, శరీరం మీద పొక్కులు కనిపిస్తాయి. కాళ్లు, కీళ్లలో నొప్పి ఉంటుంది. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి.

టైఫాయిడ్...

టైఫాయిడ్ రావడానికి ప్రధాన కారణం కలుషిత నీరు, ఆహారం. ఇది త్వరగా సంక్రమించే వ్యాధి. దీర్ఘకాలం జ్వరం, కడుపులో నొప్పి, తలనొప్పి వస్తే టైఫాయిడ్‌గా పరిగణించాలి. శరీరం మీద దుద్దుర్లు కూడా వస్తాయి. ఈ సమయంలో పిల్లలకు ఎక్కువగా ద్రవాలు తాగించాలి. వ్యాక్సినేషన్ చాలా వరకు ఈ వ్యాధిని నివారిస్తుంది.

జలుబు, దగ్గు, వైరస్ జ్వరం...

వాతావరణంలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు సాధారణ జలుబు వస్తుంది. జ్వరం, దగ్గు, జలుబు, ముక్కు కారడం, ఒంటి నొప్పులు దీని లక్షణం. ఎయిర్ కండీషన్ వల్ల కూడా జలుబు రావచ్చు. ఎయిర్ కండీషన్ ఫిల్టర్ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పిల్లల్లో ఆస్తమా రావడానికి జలుబు ఓ కారణంగా చెప్పవచ్చు. పిల్లికూతలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు అనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

అతిసార...

డయేరియా (అతిసార) అనేది కలుషిత ఆహారం తీసుకోవడం వలన వస్తుంది. డయేరియా సోకితే ఎలక్ట్రాల్ పౌడర్ నీరు తాగించాలి. తీవ్రమైన డయేరియా ఉన్నప్పుడు ద్రవ పదార్థాలు తీసుకోవాలి. రోగికి విశ్రాంతి ఇస్తే కోలుకునే వీలుంటుంది.

గ్యాస్ట్రో ఎంటరైటిస్...

కలుషిత నీరు తాగడం వల్ల పేగులకు ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. జ్వరం, వాంతులు, విరేచనాలు, ఆకలి లేకపోవడం దీని లక్షణం. శరీరంలో నీటి శాతం తగ్గుతుంది. పిల్లల్లో ఈ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించాలి.

చర్మ సమస్యలు...

ఫంగస్, బ్యాక్టీరియా కారణంగా చర్మ వ్యాధులు వస్తాయి. ఈ సమస్యలు రాకుండా చర్మాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. రాత్రి వేళల్లో కోల్డ్ క్రీములు రాసుకుంటే మేలు.

జాగ్రత్తలు తప్పనిసరి



వానాకాలంలో అనేక వ్యాధులు సోకే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లల్లో ఈ ప్రభావం ఎక్కువ. వానల్లో తడిస్తే జలుబుతో పాటు నిమోనియా వచ్చే అవకాశం ఉంది. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు బయట చిరుతిళ్లు మానేయాలి. రోజూ నీటిని వేడి చేసి చల్లార్చిన తర్వాత తాగాలి.

– **శరత్**, న్యూరాలజిస్ట్, ఒంగోలు


దోమల నివారణకు మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది


దోమల నివారణపై ప్రజలకు సూచనలు చేస్తున్న జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ

పేదలకు ఉచిత వైద్యం అభినందనీయం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో సుజాత, డాక్టర్లు వంశీకృష్ణ, శాంతకుమారి

కొత్తపట్నం: పేద ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం అభినందనీయమని డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారి దంపతులను ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత కొనియాడారు. వారికి చెందిన ఒంగోలులోని శ్రీరాం మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో కొత్తపట్నంలోని శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించగా ఎంపీడీవో ప్రారంభించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ శిబిరం సాయంత్రం 3 గంటల వరకు సాగింది. అన్ని రకాల వ్యాధులకు 160 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీవో మాట్లాడుతూ వైద్య రంగంలోనే కాకుండా విద్యార్థులు చదువుకోవడానికి కూడా సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. సొంత నగదుతో నోటు పుస్తకాలు, క్లాస్‌లో ఫస్ట్ వచ్చిన వారికి ప్రోత్సాహకాలు, దూర ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులకు బస్‌పాస్‌లు ఉచితంగా అందించడం, ఉచిత వైద్య సేవలు అందించడం ద్వారా డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారి దంపతులు మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్లు సానల ధీరజ్‌బాబు, సున్నపు విజయ్‌కుమార్, నాగిడి కుమార్‌వర్మ, హరికృష్ణప్రసాద్, నందలూరు సరయు, పొక్కింగారి ఏడుకొండలు, శ్రీవాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ చాపల కోటేశ్వరరావు, మహేంద్ర కుమార్‌వర్మ, ప్రదీప్‌వర్మ, గ్రామీణ వైద్యులు చేరుకూరి వీరరాఘవరావు, సుబ్రహ్మణ్యం, పట్టపు ప్రకాశం, హాస్పిటల్ మేనేజర్ సుధాకర్, రవి, నాగరాజు, వంశీ, మాల్యాద్రి, పున్నయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకునేందుకు యూటీఎఫ్ సంక్షేమ బోర్డు


సమావేశంలో చర్చిస్తున్న సంఘ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: కుటుంబ పెద్దను కోల్పోయి ఆపదలో ఉన్న ఉపాధ్యాయుల కుటుంబాలను ఆదుకునేందుకు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) సంక్షేమ బోర్డు కృషి చేస్తోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి జె.కేశవరాజు నివేదిక సమర్పించారు. సభ్యుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ.1.50 లక్షలు అందిస్తున్నట్లు చెప్పారు. 1994 నుంచి సంక్షేమ బోర్డు ద్వారా 280 మంది సభ్యులకు రూ.1.414 కోట్లు అందించినట్లు చెప్పారు. నూతన సభ్యుల దరఖాస్తు ఆమోదం, సంఘీబావ విరాళం ఇచ్చేందుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఉపాధ్యాయులకు ప్రతి నెలా ఒకటో తేదీ జీతాలిచ్చేందుకు సాంకేతిక సమస్యలు తొలగించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి ఎస్.ప్రసాద్, బాధ్యులు ఓవీ వీరారెడ్డి, ఎస్.రవి, వీరాంజనేయులు, షేక్ అబ్దుల్, ఉమామహేశ్వరి, సీనియర్ నాయకులు ఆదినారాయణ, కుటుంబ సంక్షేమ డైరెక్టర్లు పాల్గొన్నారు.

10న మండల సమావేశం

కొత్తపట్నం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత తెలిపారు. అన్ని శాఖలపై సంబంధిత అధికారులతో పూర్తి స్థాయిలో చర్చ జరుగుతుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ మెంబర్, జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు: నగరంలోని లాయర్‌పేట సాయిబాబా గుడి వద్ద మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 8 నుంచి 12 గంటలకు పలు ప్రాంతాలకు సరఫరా నిలిపేస్తున్నట్లు డీఈఈ వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వీఐపీ రోడ్డు, మంగమూరు రోడ్డు, కళానికేతన్, లాయర్‌పేట సాయిబాబా గుడి, కొండయ్య బంకు, గద్దలగుంట, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, రాజాపానగల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

వెంకటేష్‌ను పరామర్శించిన ఎంపీ మాగుంట


వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న చీరాల నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌ను ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డి పరామర్శించారు. ఆదివారం కరణం నివాసానికి వెళ్లిన మాగుంట ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

నూతన కమిటీకి అభినందనలు


రాష్ట్ర నాయకులను సత్కరిస్తున్న జిల్లా నాయకులు

ఒంగోలు అర్బన్: ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర కమిటీని స్థానిక భాగ్యనగర్‌లోని కార్యాలయంలో ఆదివారం అభినందించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సానల విశ్వరూపాచారి అధ్యక్షత వహించారు. రాష్ట్ర కమిటీకి ఎన్నికైన వారిలో అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి ఐ.లక్ష్మీనారాయణ, కోశాధికారి పి.నాగరాజు, ఇతర కార్యవర్గ సభ్యులు ఉండగా, వారిని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రాఘవరావు, కోశాధికారి వాకా శంకరరెడ్డి, ఇతర నాయకులు రవీంద్రనాథ్‌రెడ్డి, సుబ్బారావు, ఆళ్ల రఘురామిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి కళ్యాణం


భక్తులకు మంగళసూత్రం చూపిస్తున్న వేదపురోహితులు


స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న వేదపురోహితులు


కళ్యాణంలో పాల్గొన్న శిద్దా రాఘవరావు, తదితరులు


వైభవంగా జరుగుతున్న లక్ష్మీనృసింహస్వామి కళ్యాణం


కళ్యాణంలో భారీగా పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: నరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో సింహాచలం దేవస్థానం వారిచే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి కళ్యాణాన్ని ఆదివారం ఒంగోలులో వైభవంగా నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణ నడుమ స్వామివారు, అమ్మవార్ల కళ్యాణాన్ని సింహాచలం దేవస్థానం వేద పురోహితులు కన్నుల పండువగా జరిపించారు. ఉదయం పది గంటలకు వరాహ లక్ష్మీనృసింహ సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటలకు ఉత్సవమూర్తులకు పుణ్యాహవాచనం, రక్షాబంధనం యజ్ఞోపవీత ధారణ, కన్యాదానం, స్వామివారు, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, జీలకర బెల్లం, మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాల క్రతువును వేద పురోహితులు కమనీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారు, అమ్మవార్ల దివ్య మంగళ హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరిగింది. సింహాచలం దేవస్థానం వేద పురోహితుల పర్యవేక్షణలో నిర్వాహకులు చక్కా ప్రసాదు, నల్లమల్లి బాలు, అన్నం శ్రీనివాసులు, వేముల కోటిలింగం గుప్తా, గుర్రం బదరీ నారాయణ, లలూ బద్రీనాథ్, కమలాకర్, కోడూరి కిషోర్, కొమ్మిశెట్టి రంగ, మీరావలి, రాము పద్మనాభుని నందకుమార్ బాలసుబ్రహ్మణ్యం, చక్క సురేష్ తదితరులు పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పాల్గొని పూజలు చేశారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం


సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్ పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

ఒంగోలు టౌన్: మూఢ నమ్మకాలు, సూడో సైన్స్‌లను నిరోధించడం కోసం దేశ వ్యాపంగా విద్యాలయాలు, గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు తెలిపారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రసిద్ధ శాస్త్రవేత్తలైన సీవీ రామన్, మేరీ క్యూరీల జయంతి నుంచి జాతీయ సైన్స్ దినోత్సవం ఫిబ్రవరి 2024 వరకు శాస్త్రీయ దృక్పథ ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కళాజాతాలు, సైన్స్ ప్రయోగాలు, మ్యాజిక్ షోలు, సైడ్ పోస్టర్లు, సోషల్ మీడియా వంటి వివిధ రూపాల ద్వారా ప్రచారం కొనసాగించనున్నట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల్లోని 40 సైన్స్ సంస్థలు అనుబంధంగా ఉన్న ఏఐపీఎస్ఎస్ నేతృత్వంలో ఈ ప్రచార కార్యక్రమం జరుగుతుందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ.హెచ్ ప్రకారం పౌరులంతా శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని, ప్రభుత్వాలు అందుకనుగుణంగా సమాజంలో, పౌరుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేయాల్సిన ఉంటుందని జేవీవీ గౌరవ సలహాదారు ఏవీ పుల్లారావు తెలిపారు. ఇందుకు విరుద్ధంగా గత తొమ్మిదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రజల్లో మూఢ విశ్వాసాలను పెంపొందిస్తోందని విమర్శించారు. సైన్స్ అండ్ టెక్నాలజీకి సగటు 1.8 శాతం ఉండగా దేశ జీడీపీలో 0.7 శాతం మాత్రమే నిధులు కేటాయించడం ఇందుకు నిదర్శనం అన్నారు. ఇలాంటి తిరోగమని చర్యలను కేంద్రం మానుకోకుంటే దేశ భవిష్యత్తరాలు నష్టపోతాయన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ సందీప్, డాక్టర్ శరత్‌లు ప్రసంగించారు. జేవీవీ నాయకులు సిహెచ్ సుబ్రమణ్యం, కె.నారాయణ, యన్.నాగేశ్వరరావు, కె.సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.